సంగారెడ్డి చెత్త మాకొద్దు

- డంప్‌యార్డు నిర్మించడం తగదు
- పరిశ్రమల కాలుష్యంతోనే సతమతం
- అధికారులపై గ్రామస్తుల ఆగ్రహం


గుండ్ల మాచనూర్‌లో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

హత్నూర(సంగారెడ్డి): సంగారెడ్డి మున్సిపాలిటీ చెత్త తమకు వద్దంటూ మండలంలోని గుండ్ల మాచనూర్ గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. కంది మండలం ఆరుట్ల శివారులోని సర్వే నంబర్ 133లోని సంగారెడ్డి మున్సిపాలిటీ డంప్‌యార్డు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అయితే దానిని మంత్రి దామోదర్ రాజనర్సింహ మంగళవారం ప్రారంభించేందుకు జిల్లాస్థాయి అధికారులు ఏర్పాట్లు చేశారు. గుండ్ల మాచనూర్ గ్రామానికి సమీపంలో డంప్ యార్డు పనులు కొనసాగుతుండగా ఆ గ్రామస్తులు గతంలో పలుమార్లు అడ్డుకున్నారు. మంగళవారం ఉదయం కంది, హత్నూర తహసీల్దార్లు, సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్లు పోలీసు సిబ్బందితో గ్రామానికి చేరుకొని స్థానికులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. పరిశ్రమల నుంచి వెలువడుతున్న విషవాయువులతో ఇప్పటికే ఉండలేకపోతున్నామని, ఇక డంప్ యార్డు నిర్మాణం చేపడితే గ్రామంలో ఎలా జీవించాలని వారు అధికారులను నిలదీశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో చేరుకొని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. మోడల్ స్కూల్ సైతం సమీపంలోనే ఉందని, అధికారులు సహకరించక పోతే ప్రతిరోజూ ఆందోళన చేస్తామని హెచ్చరించారు. దీంతో చేసేదిలేక అధికారులు అక్కడి నుంచి వెనుతిరిగారు.

క్లుప్తంగా

బీఎంఎస్‌తోనే సమస్యల పరిష్కారం


జెండాను ఆవిష్కరించిన జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్

పటాన్‌చెరు టౌన్ : కార్మికుల సమస్యల పరిష్కారం బీఎంఎస్‌తోనే సాధ్యమని జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పారిశ్రామిక వాడలోని అగర్వాల్ రబ్బర్ లిమిటెడ్ పరిశ్రమతో పాటు బస్టాండ్ వద్ద జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రధాన కార్యదర్శి సాయన్న, జేక్ ఫెన్నర్ ప్రధాన కార్యదర్శి నవీన్, భీమన, మధు, ఆంజనేయులు, సదాత అలీ, కృష్ణ పాల్గొన్నారు.

పంట దిగుబడిపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సత్యనారాయణ

మునిపల్లి(అందోల్): మునిపల్లి రైతువేదికలో మంగళవారం పత్తి పంట దిగుబడి, చీడపీడల నివారణపై ఏడీఏ సత్యనారాయణ అవగాహన కల్పించారు. 18 ఏళ్ల వయసుపై బడిన రైతులు ఈ నెల 30వ తేదీ వరకు బీమా చేయించుకోవాలని సూచించారు. పంటల వివరాలు తప్పక నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శివకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు


బోనాల ఊరేగింపు

జోగిపేట(అందోల్)/ వట్‌పల్లి(అందోల్): జోగిపేటలో మంగళవారం బోనాల పండగను వైభవంగా నిర్వహించారు. తూర్పుగౌని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి.. బోనాల ఊరేగింపును ప్రారంభించారు. అలాగే వట్‌పల్లి మండల పరిధిలోని మర్వెల్లి గ్రామంలో రేణుకా ఎల్లమ్మకు బోనాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

స్మిత సబర్వాల్‌పై ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న పద్మ సంగమేశ్వర్

కల్హేర్(నారాయణఖేడ్): దివ్యాంగులను కించపరిచినట్లు మాట్లాడిన ఐఏఎస్ స్మితసబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక మండల అధ్యక్షులు పద్మ సంగమేశ్వర్ కల్హేర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సాయిలు, నితిన్, దత్తు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి


భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని పార్కుల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని కార్పొరేటర్ పుష్పనగేశ్ చెప్పారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శ్రీసాయినగర్ కాలనీలో థీమ్ పార్కులో చిన్నారులు ఆడుకునే వస్తువులను ఏర్పాటు చేసేందుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కాలనీలో పర్యటించినప్పుడు కాలనీవాసులు పలు సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ప్రధానంగా థీమ్ పార్కులో చిన్నారుకు ఆటవస్తువులు ఏర్పాటు చేయాలని కోరారని చెప్పారు. దీంతో అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లగా రూ.15లక్షల మంజూరు చేశారని, అలాగే కాలనీలో రోడ్డు సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు.

ఓబీసీల హామీలను అమలు చేయాలి

- బీజేపీ మండల అధ్యక్షుడు వీరేశం


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

పటాన్‌చెరు టౌన్: సీఎం రేవంత్ రెడ్డి ఓబీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు వీరేశం డిమాండ్ చేశారు. మంగళవారం ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలల లోపే కులగణనచేసి బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చారని వాటిని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో దేవేందర్ గౌడ్, రవీందర్, శేఖర్ రెడ్డి, వీరారెడ్డి, అల్లంరాజ రెడ్డి, రాజేశ్, ఆంజనేయులు, అరవింద్ వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

- మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి


రంజోల్‌లో సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: మున్సిపాల్టీలో విలీనమైన రంజోల్ గ్రామాన్ని మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. వర్షాలు కురుస్తుండటంతో పారిశుద్ధ్య సమస్యలను తెలుసుకొనేందుకు గ్రామంలో పర్యటించారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని మురికి నీరు వెళ్లే పెద్ద కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున పారిశుద్ధ్య సమస్యతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ కూడా చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ నాయకులు అన్నారు. మంగళవారం బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శివాజీ పాటిల్, మండల అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ రాజీరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ పాటిల్ మాట్లాడుతూ.. కామారెడ్డిలో జరిగిన ఎన్నికల సభలో ప్రచార సభలో కాంగ్రెస్ నాయకులు పలు హామీలను ఇచ్చారన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 23 నుంచి 42 శాతానికి పెంచుతామని, గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.2లలక్షలు వేస్తామని అన్నారు. అధికారంలోకి వచ్చి చాలా రోజులైనా ఇచ్చిన హామీలను నేరవేర్చడం లేదని పేర్కొన్నారు. హామీలను వెంటనే నెరవేర్చాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులను అవమానించడం దారుణం


మాట్లాడుతున్న తుకారాం

నారాయణఖేడ్: ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ దివ్యాంగులను అవమానించేలా ట్వీట్ చేయడం దారుణమని నారాయణఖేడ్ నియోజకవర్గ భీమ్‌ఆర్మీ అధ్యక్షుడు అనుముల తుకారాం అన్నారు. మంగళవారం నారాయణఖేడ్‌లో ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులుగా పుట్టడమే పాపమా అని అన్నారు. వెంటనే ఆమె దివ్యాంగులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం నాయకులు

మునిపల్లి(అందోల్): అనారోగ్యంతో మృతి చెందిన ఫొటోగ్రాఫర్ రమేశ్ కుటుంబానికి ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం అధ్వర్యంలో చేయూత అందించారు. మంగళవారం మునిపల్లిలో రమేశ్ కుటుంబ సభ్యులకు రూ.25 వేలు నగదు అందజేశారు. ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లకు ఎవరికైనా అనారోగ్య సమస్యలుంటే తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మునిపల్లి మండల ఫొటో గ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, ఉపాధ్యక్షులు వెంకట్, ప్రధాన కార్యదర్శి మల్లేశ్ యాదవ్, ప్రత్యేక గౌరవ అధ్యక్షులు కన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

తస్మాత్ జాగ్రత్త

కల్హేర్(నానాయఖేడ్): భూములు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సిర్గాపూర్ ఎస్‌ఐ డి.వెంకట్‌రెడ్డి సూచించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మధ్యవర్తులు, దళారులు కుమ్మక్కై పడావు భూములు అమ్ముతూ మోసం చేస్తున్నారని, రికార్డుల్లో సర్వే నంబరు, హద్దుల వివరాలు తెలుసుకొని స్థలాలను కొనాలని కోరారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి


వినతి పత్రం అందిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): బీసీ డిక్లరేషన్‌ను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ జిన్నారం మండల అధ్యక్షుడు శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిన్నారంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి, తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


హద్నూర్‌లో పిచ్చి మొక్కలపై మందును పిచికారీ చేయిస్తున్న శ్యామల

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మిర్జాపూర్(బి)పీహెచ్‌సీ సూపర్ వైజర్ శ్యామల అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హద్నూర్‌లో వైద్య సిబ్బందితో కలిసి ఆమె ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇళ్లల్లో ఎవరైనా జ్వరాలు, రోగాలతో బాధ పడుతున్నారా? లేదా? అని అడిగి, పరిసరాలు ఎలా ఉన్నాయనే విషయాలను పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలపై మందులను పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కుళాయిలు, డ్రమ్ముల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వ్యాధులు సోకిన వెంటనే పీహెచ్‌సీకి వచ్చి వైద్యం చేయించుకోవాలని సూచించారు. ఆమె వెంట వైద్య సిబ్బంది, ఆశావర్కర్ తదితరులున్నారు.

పెండింగ్ వేతనాల కోసం నిరసన



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

జహీరాబాద్ టౌన్: పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద కాంట్రాక్టు కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ యూనైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి మాట్లాడారు. నెల జీతంపై ఆధారపడి కాంట్రాక్టు కార్మికులు జీవిస్తున్నారన్నారు. కాంట్రాక్టర్ రెగ్యులర్‌గా వేతనాలివ్వడం లేదన్నారు. దీంతో వారి కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలివ్వాలని, లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్, యూనియన్ నాయకులు ఎలిషా, సుమలత, పవన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రంజీ క్రికెటర్ పర్యటన


దత్తాచల క్షేత్రంలో క్రికెటర్ తదితరులు

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలంలో ఇండియన్ క్రికెటర్ నాగేందర్ మంగళవారం పర్యటించినట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు. జిల్లా ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు హైదరాబాద్ రంజీ క్రికెటర్ నాగేందర్ మండల కేంద్రమైన హత్నూర ప్రాథమికోన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దత్తాచల క్షేత్రాలను పరిశీలించారు. ఎంపీడీఓ శంకర్, ఎంపీఓ సువర్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేశ్ ఆయనతో పాటు ఉన్నారు. రీసెర్చ్‌పై అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు క్రికెటర్‌కు పాఠశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని చూపించామని ఎంపీడీఓ శంకర్ తెలిపారు.

నిధులు రావడం లేదని ఆరోపణలు

- ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

పటాన్‌చెరు: ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో ఉన్న సీతారామ వెంచర్‌కు జీహెచ్‌ఎంసీ నిధులు ఖర్చు చేసి సీఎం, అధికారులు నిధులు ఇవ్వడం లేదని కార్పొరేటర్ ఆరోపణలు చేయడం సరికాదని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... పటాన్‌చెరు నియోజకవర్గానికి రోడ్లు, డ్రైనేజీకు ఇప్పటికే రూ.10 కోట్లు సీఎం విడుదల చేశారన్నారు. సీతారాంపురం ప్రైవేట్ వెంచర్లుకు రూ.45 లక్షలు డ్రైనేజీ, పైప్‌లైన్ పనులు ప్రతిపాదికలు కార్పొరేటర్ పంపడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. ప్రభుత్వ నిధులు ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో మాజీ టీపీసీసీ సెక్రెటరీ మతిన్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అతిక్, కాంగ్రెస్ నాయకులు యువరాజ్ మోరే, వడ్డే గోపాల్ పాల్గొన్నారు.

వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి టౌన్: వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐకేపీ ఉద్యోగులు 20 ఏళ్ల నుంచి గ్రామాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేస్తూ మహిళలు సామాజికంగా ఎదగడానికి అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నారని, వీరికి సక్రమంగా లోన్లు చెల్లించేలా అనేక పనులు చేస్తున్న వీరికి కనీస వేతనం లేదన్నారు. కనీసం రూ.26,000 ఇవ్వాలని, వీటితో పాటు ఉద్యోగ భద్రత కల్పించి బీమా సౌకర్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగేష్, నాయకులు మల్లయ్య, లక్ష్మారెడ్డి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహ ఆవరణలో వనమహోత్సవం


మొక్కలు నాటుతున్న వసతిగృహాల అధికారులు

నారాయణఖేడ్: ఖేడ్‌లోని కళాశాల బాలుర వసతిగృహ ఆవరణలో మంగళవారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో వనమహోత్సవాన్ని నిర్వహించారు. పురపాలక సిబ్బందితో కలిసి వసతిగృహ సంక్షేమ అధికారి చంద్రశ్రీనివాస్, సమీకృత వసతిగృహ సంక్షేమ అధికారులు రవీందర్, పరిసరాల్లో వివిధ రకాల పండ్ల, పూల మొక్కలను నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు చర్యలు తీసుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వసతిగృహ విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ డ్రంకెన్‌డ్రైవ్‌లో తొమ్మిది మంది పట్టివేత

పటాన్‌చెరు టౌన్ : పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో శని, ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో తొమ్మిది మంది వాహనదారులు పట్టుబడినట్లు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ తెలిపారు. పట్టుబడిన వాహన దారులను మంగళవారం జిల్లా కోర్టులో హాజరు పర్చగా జడ్జి ఏడుగురికి రూ. 2వేల చొప్పున జరిమానా, మరో ఇద్దరికి జరిమానాతోపాటు జైలుశిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

◆ ఆలయ నిర్మాణానికి విరాళం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి మంగళవారం మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, జై భవాని నర్సరీ యజమాని కుమార్ గౌడ్ రూ 50వేల విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కృష్ణగౌడ్, సత్యనారాయణ గౌడ్, లక్ష్మాగౌడ్ పాల్గొన్నారు.

◆ ముంగిలో రైతునేస్తం

న్యాల్‌కల్ (జహీరాబాద్) : మండల పరిధిలోని ముంగి రైతు వేదికలో మంగళవారం రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పత్తి పంటలో తీసుకోవలసిన జాగ్రతలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. వర్షాలకు పత్తి పంటకు సోకే తెగుళ్ల, వాటి నివారణ, నీరు నిల్వ ఉండకుండా తీసుకోవలసిన జాగ్రతల గురించి వివరించారు. జహీరాబాద్ ఏడీఏ బిక్షపతి, ఏఓ లావణ్య, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

◆ బీజేవైఎం మండల అధ్యక్షులుగా గణేశ్

హత్నూర(సంగారెడ్డి): బీజేవైఎం హత్నూర మండల అధ్యక్షుడిగా మంగాపూర్‌కు చెందిన కుమ్మరి గణేశ్ నియమితులయ్యారు. ఆ మేరకు నియామక పత్రాన్ని బీజేపీ హత్నూర మండలాధ్యక్షుడు నాగప్రభు గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా బీజేవైఎం అధ్యక్షుడిగా ఎంపికైన ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి మండలాధ్యక్షుడిగా నియమించినందుకు మండల జిల్లా స్థాయి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో బీజేపీ బలోపేతం కోసం పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నర్సాపూర్ అసెంబ్లీ కోకన్వీనర్ ఎర్ర సతీశ్, బీజేవైఎం నర్సాపూర్ కన్వీనర్ శ్రీకాంత్, బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు చంద్ర గౌడ్, బీజేపీ మండల కార్యదర్శి తోట రాజు, నాయకులు మల్లేశ్‌యాదవ్, నాయకులు నాగరత్నం, సుజిత్ పాల్గొన్నారు.

◆ బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం

జహీరాబాద్ టౌన్: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని సంఘం నాయకులు మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. వెంకటాపూర్ వద్ద గల గ్లోబల్ గ్రీన్ కంపెనీ వద్ద బీఎంఎస్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమంతో పాటు దేశం కోసం బీఎంఎస్ పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి బి. వీర్ శెట్టి, ఉపాధ్యక్షుడు రవీంద్రనాథ్, నాయకులు బాష, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ దరఖాస్తు చేసుకోండి

జహీరాబాద్ టౌన్: అర్హులైన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ విస్తీరణ అధికారి ప్రదీప్ కుమార్ సూచించారు. కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకం పొందిన 18 నుంచి 59 సంవత్సరాలలోపు రైతులు బీమాకు అర్హులన్నారు. దరఖాస్తుతోపాటు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్ తదితర పత్రాలను అందజేయాలన్నారు. ఆగస్టు 5 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

◆ ఉచిత దంత వైద్య శిబిరం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి జిల్లా కోర్టులో మంగళవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. హ్యాపీ హెల్త్ కేర్ మల్టీ స్పెషాలిటీ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, బార్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ వాహనాల తనిఖీ

సంగారెడ్డి టౌన్: ఎస్పీ రూపేష్ ఆదేశాల మేరకు సంగారెడ్డి మండలం ఎంఎన్‌ఆర్ చౌరస్తా వద్ద సంగారెడ్డి రూరల్ పోలీసులు మంగళవారం జాగిలాలతో వాహనాలను తనిఖీ నిర్వహించారు. జిల్లాలో గంజాయి, డ్రగ్స్ రవాణా నిర్మూలనలో భాగంగా ఈ తనిఖీలు చేసినట్లు రూరల్ ఎస్సై వినయ్ కుమార్ తెలిపారు. ఎక్కడైనా గంజాయి రవాణా చేసిన, పండించిన 8712656777 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

◆ 27కు వేలం వాయిదా

జోగిపేట(అందోల్): ఆందోల్ -జోగిపేట పురపాలక సంఘంలోని గాంధీపార్క్ షాపింగ్ కాంప్లెక్స్ సముదాయానికి సంబంధించిన వేయనున్న వేలం వాయిదా పడింది. అనుకున్నంతగా దరఖాస్తులు రాకపోవడం వల్ల మరో రెండు రోజులు టెండర్లకు అవకాశం కల్పిస్తున్నట్లు కమిషనర్ తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. 12 దుకాణాలకు గాను బహిరంగ వేలం కోసం 49 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీ వరకు ధరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

◆ నీటి సమస్యను పరిష్కరించండి

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలో గల 11వ వార్డులో నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు తెలిపారు. నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. కాలనీలో ఉన్న మూడు బోర్లు చెడిపోయాయని, వీటిని బాగు చేయించి నీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

◆ శివాలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయ నిర్మాణానికి బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డి తన వంతు సహకారాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు. మంగళవారం ఆయనను దేవాలయ నిర్మాణ నిర్వాహకులు కలిసి నిర్మాణ వివరాలు వివరించారు. దీంతో రూ.4 లక్షలతో శ్లాబ్ వేయించేందుకు అనిల్‌కుమార్‌రెడ్డి ముందుకు వచ్చారు. కార్యక్రమంలో దేవాలయ నిర్మాణ నిర్వాహకులు ప్రతాప్‌రెడ్డి, ఆనంద్‌చారి, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, బ్రహ్మేందర్‌గౌడ్, పల్నాటి భాస్కర్, రాజుగౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వట్‌పల్లి(అందోల్): పత్తి పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టి చీడ పురుగులను నివారించాలని జోగిపేట ఏడీఏ అరుణ సూచించారు. మంగళవారం అందోలు మండల పరిధిలోని డాకూర్ రైతువేదిక భవనంలో పత్తిపంటలో రసం పీల్చు పురుగుల నివారణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ పత్తి పంటకు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ విజయరత్న, ఏఈఓ శ్రీనివాస్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డంప్‌యార్డు పనుల అడ్డగింత

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని గుండ్ల మాచునూర్ గ్రామ సమీపంలో సంగారెడ్డి మున్సిపాలిటీ డంపు యార్డ్ ఏర్పాటును గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పరిశ్రమల కాలుష్యంతో అనారోగ్యాలకు గురవుతున్నామన్నారు. దీంతో డంప్ యార్డ్ నిర్మాణం చేపడితే భవిష్యత్ తరాలకు తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. గతంలో అధికారులు చేపట్టిన డంప్ యార్డు సర్వే పనులను అడ్డుకున్నామని గుర్తు చేశారు. అయినా అధికారులు పట్టించుకోకుండా మరోసారి పనులను చేపట్టడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డంప్‌యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనల కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

నారాయణఖేడ్: పట్టణంలోని కూరగాయల మార్కెట్, బసవేశ్వర చౌక్ వైపుల నుంచి వస్తున్న మురుగునీటిలో ప్లాస్టిక్ బాటిళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తచెదారం కొట్టుకువచ్చి రాజీవ్‌చౌక్ సమీపంలోని మురుగుకాలువ వద్ద కలుస్తుండటంతో జామ్ అవుతోంది. దీంతో మురుగునీరు కాల్వలోంచి వెళ్లలేక మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఆదివారం రాత్రి భారీ వర్షం కురియడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారి రాజీవ్ చౌక్ ప్రాంతం చెరువును తలపించింది. దీంతో సోమవారం మున్సిపల్ కార్మికులు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే పనులు చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కమిషనర్ జగ్జీవన్, శానిటరీ అధికారి శ్రీనివాస్ పనులను పర్యవేక్షించారు.

బెల్ట్‌షాపులను నియంత్రించండి

సంగారెడ్డి టౌన్: గ్రామాల్లోని బెల్ట్ షాపులను నియంత్రించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అనిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా ఎక్సైజ్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలు, బస్తీలలో గుట్టుచప్పుడు కాకుండా బెల్టు షాపులను నిర్వహిస్తున్నారన్నారు. ఎక్సైజ్ అధికారులు వెంటనే స్పందించి తనిఖీలు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు శివ, సాయి, ప్రశాంత్, ప్రభు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్ హద్దులను ఏర్పాటు చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మండల పరిధిలోని చెరువులు, కుంటల సర్వే నిర్వహించి హద్దురాళ్లను ఏర్పాటు చేయాలని తెల్లాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి అన్నారు. ఎఫ్‌టీఎల్ హద్దులను ఏర్పాటు చేయాలని కోరుతూ తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం ఆందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని భూముల ధరలు పెరగడంతో రియల్ వ్యాపారులు చెరువులను, కుంటలను వదలడం లేదన్నారు. ఫలితంగా చెరువులు, కుంటలు అన్యాక్రాంతమవుతున్నాయని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి గ్రామస్తుల సమక్షంలో చెరువులు, కుంటలను సర్వే చేసి హద్దురాళ్లను ఏర్పాటు చేయాలని కోరారు.

రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ

రాయికోడ్(అందోల్): అర్హులై ఉండి రూ.లక్ష లోపు పంట రుణమాఫీ కాని రైతుల నుంచి వ్యవసాయ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. రాయికోడ్‌లోని రైతువేదికలో మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ ఆధ్వర్యంలో ఏఈఓలు అర్హులై ఉండి రుణమాఫీ కాని రైతుల పేర్లు, ఆధార్ నెంబరు తదితర వివరాలను ప్రత్యేక రిజిష్టరులో నమోదు చేసుకున్నారు. ఆధార్ కార్డులోని పేరు, బ్యాంకు ఖాతాలో రైతు పేరులో తేడాలు ఉండటం, ఒకే రేషన్‌కార్డులో నమోదై ఉన్న ఇద్దరు పంట రుణాలు తీసుకుని ఉండటం, తదితర కారణాలతో పలువురు రైతులకు రుణమాఫీ కావడంలేదని అధికారులు తెలిపారు. రైతుల నుంచి వచ్చిన వినతుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల మేరకు అర్హులైనవారికి రుణమాఫీ అమలయ్యేవిధంగా కృషి చేస్తామని ఏఓ అభినాష్‌వర్మ వివరించారు.

అభివృద్ధికి నిధులు ఇవ్వాలి

పటాన్‌చెరు టౌన్: హెచ్ఎండబ్ల్యూఎస్ ఎండీ అశోక్‌రెడ్డి తీరు సరికాదని కార్పొరేటర్ కుమార్ యాదవ్ అన్నారు. అభివృద్ధికి నిధులు ఇవ్వాలని హెచ్ఎండబ్ల్యూఎస్ ఎండీ అశోక్‌రెడ్డికి కార్పొరేటర్ కుమార్ యాదవ్ సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 113 డివిజన్ పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కాలనీలలో అంతర్గత డ్రైనేజీల నిర్మాణం, నూతన పైపులైన్లు, రోడ్ల పునరుద్ధరణ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరగా బోర్డులో నిధులు లేవని, హైదరాబాద్‌లోని ఇతర డివిజన్‌లకు కూడా నిధులు మంజూరు చేయలేని పరిస్థితిలో ఉన్నామని చెప్పడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి హైదరాబాద్ పరిధిలోని డివిజన్‌లలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

కరెంటు కష్టాలకు చెక్

పెద్దారెడ్డిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ స్థాయి పెంపు

- 3.15 నుంచి 5 ఎంవీఏకు పెరిగిన సామర్థ్యం
- నూతనంగా విద్యుత్ బ్రేకర్ల ఏర్పాటు
- తీరనున్న లోఓల్టేజీ సమస్య
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



పెద్దారెడ్డిపేట విద్యుత్ సబ్‌స్టేషన్

పుల్‌కల్(అందోల్): విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంచి లోఓల్టేజీ సమస్యకు అధికారులు తెరదించారు. దశాబ్దంన్నర పాటు వినియోగదారులు ఎదుర్కొంటున్న కష్టాలకు అదనపు సామర్థ్యం పెంపుతో చెక్ పెట్టారు. మండల పరిధిలోని పెద్దారెడ్డిపేటలో 15 ఏళ్ల క్రితం అప్పటి ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. అప్పటి విద్యుత్ వినియోగం తగ్గట్టు 3.15 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. అయితే సబ్‌స్టేషన్ పరిధిలో వినియోగదారుల సంఖ్య, వ్యవసాయ మోటార్ల సంఖ్య అధికంగా పెరిగింది. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలో సింగూరు, పెద్దారెడ్డిపేట, రాయిపాడ్, మంతూరు గ్రామాల్లో తరుచూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతూ వస్తోంది. దీంతో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై విద్యుత్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ.. స్పష్టమైన ఆదేశాలు జారీ కాకపోవడంతో జాప్యం జరుగుతూ వచ్చింది.

మంత్రి దామోదర చొరవతో

మంత్రి దామోదర రాజనర్సింహ చొరవ తీసుకొని సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంపు ప్రతిపాదనలను అమలు చేయించారు. రూ 80 లక్షల నిధులు ఖర్చు చేసి 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించి బిగించారు. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాల ప్రజలకు విద్యుత్ కష్టాలు తీరాయి.

సబ్‌స్టేషన్ స్థాయిని పెంచాం



విద్యుత్ లోఓల్టేజీని అధిగమించడానికి పెద్దారెడ్డిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ స్థాయిని పెంచాం. 3.15 ఎంవీఏ నుంచి 5 ఎంవీఏ సామర్థ్యానికి పెంచాం. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాల రైతులకు ఇక నుంచి ఇబ్బందులు ఉండవు. పెద్దారెడ్డిపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లోనే కాకుండా ముద్దాయిపేట సబ్‌స్టేషన్‌లో కూడా ప్రత్యేక బ్రేకర్లను ఏర్పాటు చేశాం.

– ప్రసాద్, ట్రాన్స్‌కో ఏఈ, పుల్‌కల్

విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకుడు అశోక్

సదాశివపేట(సంగారెడ్డి): పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. కేవీపీఎస్ అధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఎస్సీ సంక్షేమ వసతి హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందువల్ల వైద్యులు, మందులను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, దుప్పట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఆయన వెంట కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేశం, మండల కార్యదర్శి మహేష్, నాగరాజ్, పవన్, కల్యాణ్, అనంద్ తదితరులు ఉన్నారు.

స్మితాసబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

జోగిపేట(అందోల్): దివ్యాంగులను కించపరిచే విధంగా మాట్లాడిన ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని అందోల్ డివిజన్ వికలాంగుల కమిటీ సభ్యులు సీఐ అనిల్‌కుమార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. అదేవిధంగా తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి పోచయ్య అందోల్ డివిజన్ అధ్యక్షుడు సుభాష్ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, పుల్కల్ మండల అధ్యక్షుడు నాగయ్య, చౌటకూర్ మండల అధ్యక్షుడు కృపాకర్, నాయకులు బసవరాజ్, ఉస్మాన్ పాల్గొన్నారు.

వికలాంగులకు క్షమాపణ చెప్పాలి

జహీరాబాద్ టౌన్: వికలాంగుల మనోభావాలు దెబ్బతినే విధంగా ట్వీట్ చేసిన ఐఏఎస్ అధికారిణి స్మితాసబర్వాల్ వెంటనే క్షమాపణ చెప్పాలని వికలాంగుల జాతీయ వికలాంగుల హక్కుల వేదిక



సీఐకి ఫిర్యాదు చేస్తున్న యూనియన్ నాయకులు

డివిజన్ అధ్యక్షుడు కొనింటి నర్సింహులు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో వికలాంగులకు రిజర్వేషన్ ఇవ్వడాన్ని తప్పుపట్టడం సరికాదన్నారు. ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఇవ్వాలని కోర్టు తీర్పులు ఉన్నాయన్నారు. అయినా వికలాంగుల మనోభావాలు దెబ్బతీసేవిధంగా పోస్టు పెట్టిన ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఏజెంట్లతోనే ఎల్ఐసీ సంస్థకు మనుగడ

జహీరాబాద్ టౌన్: ఏజెంట్లతోనే ఎల్ఐసీ సంస్థకు మనుగడని ఏజెంట్స్ ఫెడరేషన్ సికింద్రాబాద్ డివిజన్ రాష్ట్ర అధ్యక్షుడు రామస్వామి అన్నారు. పట్టణంలోని అతిథి ఇన్‌లో సోమవారం నిర్వహించిన డివిజన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఐసీకి ఏజెంట్లు పిల్లర్‌లాంటి వారన్నారు. భవిష్యత్తులో మరిన్ని మార్పులు వస్తాయని, ప్రతిఒక్క ఏజెంట్ యూనియన్‌లో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి సునిల్, జహీరాబాద్ యూనియన్ అధ్యక్షుడు సుభాష్, ప్రధాన కార్యదర్శి ప్రభుశంకర్, కోశాధికారి మచ్చెందర్ పాల్గొన్నారు. అనంతరం జహీరాబాద్ డివిజన్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విఠల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా తేజారెడ్డి, కోశాధికారిగా ప్రవీణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



మాట్లాడుతున్న రామస్వామి

కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): కాలుష్యాన్ని వదులుతున్న పరిశ్రమలపై పీసీబీ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఖాజీపల్లి కాలుష్య నివారణ జేఏసీ చైర్మన్ దండె రమాకాంత్ డిమాండ్ చేశారు. ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని రసాయన పరిశ్రమలు వదులుతున్న కాలుష్యజలాలను జేఏసీ నాయకులు ఆదివారం అర్ధరాత్రి పరిశీలించారు. పలు పరిశ్రమల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా కాలుష్య జలాలను వదులుతున్నారని పీసీబీ టాస్క్‌ఫోర్స్ అధికారులకు ఫిర్యాదు చేయగా జేఏసీ నాయకులతో కలిసి సోమవారం కాలుష్య జలాలు వదులుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పీసీబీ అధికారులు మాట్లాడుతూ కాలుష్య జలాలను వదులుతున్న పరిశ్రమల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌తో పాటు పీసీబీ ఎంఎస్‌కు ఫిర్యాదు చేస్తామని రామాకాంత్ తెలిపారు.

నియామకం



బలరామ్‌కు నియామకపత్రం అందజేస్తున్న గోదావరి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పట్టణానికి చెందిన బలరాంను నియమిస్తూ ఆ పార్టీ బీజేపీ అధ్యక్షురాలు గోదావరి సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన గోదావరి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, కులకర్ణి, శ్రీనివాస్‌గుప్తాకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో బీజేపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

కంగ్టి(నారాయణఖేడ్): నూతన పట్టాదారులు రైతుబీమా దరఖాస్తులు వచ్చే నెల 5వ తేదీ లోపు సంబంధిత ఏఈఓలకు సమర్పించాలని ఏఓ ప్రవీణ్‌చారి అన్నారు. మండలంలోని రాంతీర్థ్‌లోని రైతువేదికలో ఏఈఓ వెంకటేశం నూతన పట్టాదారుల వద్ద దరఖాస్తులు స్వీకరించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

జోగిపేట ఏడీఏ అరుణ

పట్‌పల్లి(అందోల్): మినుము పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జోగిపేట ఏడీఏ శ్రీలత సూచించారు. అందోలు మండల పరిధిలోని తాలెల్మ గ్రామంలో సాగుచేసిన మినుము పంటను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట శాఖీయ దశ నుంచి పూత దశలో తెల్లదోమ, సునుబంక సోకినట్లు గుర్తించామన్నారు. ఈ వైరస్ వల్ల మొక్కలు పసుపు రంగులోకి మారుతాయన్నారు. వైరస్ నివారణకు మోనోక్రోటోపాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా డైపెన్ థయూరన్ 1.5 గ్రాములు ఎసిటామిసిడ్ 0.2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. డివిజన్ పరిధిలోని ఆందోల్, పుల్కల్, హత్నూర మండలాల్లోని రైతులు రైతుబీమా పథకం కోసం దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జూన్ 28 వరకు పట్టా పాస్‌బుక్‌లు పొందిన రైతులతో పాటు గతంలో ఎవరైనా రైతుబీమాకు దరఖాస్తు చేసుకోనివారు కూడా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫాం, పట్టాపాస్ బుక్, ఆధార్, నామినీ ఆధార్ జిరాక్స్ కాపీలు ఏఈఓలకు అందజేయాలని సూచించారు. కోఆర్డినేటర్ రాహుల్ విశ్వకర్మ, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సరిత, రైతులు పాల్గొన్నారు.



మినుము పంటను పరిశీలిస్తున్న అధికారులు

'ప్రజావాణి'కి దరఖాస్తుల వెల్లువ



నారాయణఖేడ్: వినతులు స్వీకరిస్తున్న ఆర్డీఓ అశోక చక్రవర్తి

నారాయణఖేడ్: రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ అశోక చక్రవర్తి, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐదు ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఖేడ్ పట్టణానికి చెందిన జుబేదాబేగం కూతురు అమరుల్లా ఫాతిమా వివాహం జరిగినందున తమ రేషన్ కార్డులో నుంచి ఆమె పేరు తొలగించాలని కోరారు. సిర్గాపూర్ మండలం ఖాజాపూర్ గ్రామ శివారులోని స్వాతంత్ర్య సమరయోధుడైన సత్యనారాయణ నుంచి 1977లో తాను 7.20 ఎకరాల భూమి కొనుగోలు చేశానని తనకు ఎన్వోసి ధ్రువపత్రం అందజేయాలని మల్లయ్య వినతిపత్రం అందజేశారు. 60 ఏళ్లుదాటిన వీఆర్ఎల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ వీఆర్వోల వారసులైన వెంకటాపూర్‌కు చెందిన శంకర్, అనంతసాగర్‌కు చెందిన సంగమేశ్వర్ కోరారు. ఖేడ్ పట్టణంలోని మంగల్‌పేట్, బీకేఎస్ కాలనీలో వీధికుక్కల బెడదను నివారించాలని కాన్షీరాం వినతిపత్రాన్ని అందజేశారు.

ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో..

మునిపల్లి(అందోల్): ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఆయా గ్రామాల నుంచి ఏడుగురు దరఖాస్తు చేసుకున్నారు. పింఛన్ మంజూరు చేయాలని మల్లిఖార్జునపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు ఫిర్యాదు దరఖాస్తు చేసుకోగా భూముల సమస్యలపై తహసీల్దార్ తెన్‌మెళికి నలుగురు దరఖాస్తు చేసుకున్నట్లు ఉప తహసీల్దార్ కృపదానం పేర్కొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కంది(సంగారెడ్డి): ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విజయలక్ష్మి అన్నారు. కందిలో నిర్వహించిన ప్రజావాణిలో పలువురు నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి సోమవారం కలెక్టరేట్‌కు వెళ్లకుండా మండల కేంద్రంలోనే ప్రజావాణి నిర్వహిస్తామన్నారు. ఎంపీడీఓ శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

సదాశివపేట(సంగారెడ్డి): రైతులకు విత్తనాలు ఎరువుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పృథ్వీరాజ్ అధికారులను కోరారు. తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రైతులకు విత్తనాలు ఎరువుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. సమాఖ్య నాయకులు వెంకట్‌రావు, జలీల్ పాల్గొన్నారు. నాలుగు వినతులు అందినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

కంగ్టి మండలంలో...

కంగ్టి(నారాయణఖేడ్): తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో భూ సమస్యలపై రాంతీర్థ్, బోర్గి, కంగ్టి తదితర గ్రామాల నుంచి వినతులు అందినట్లు తహసీల్దార్ విష్ణుసాగర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ప్రవీణ్‌చారి, ఎంపీడీఓ సత్తయ్య, డీటీ జుబేర్ అహ్మద్, ఆర్ఐ లక్ష్మణ్, లైన్ ఇన్‌స్పెక్టర్ బాబు, జూనియర్ అసిస్టెంట్లు వినోద్, గౌస్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

జిన్నారం(పటాన్‌చెరు): తహశీల్దార్ కార్యాలయంతో పాటు బొల్లారం మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కేంద్రంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను కమిషనర్ మంగతాయారు, అధికారులు స్వీకరించారు. గుమ్మడిదలలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ గంగాభవాని ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు.

మూడు ఫిర్యాదులు

పటాన్‌చెరు టౌన్: తహసీల్దార్ రంగారావు, ఎంపీడీవో యాదగిరిల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణికి రుద్రారం గ్రామం నుంచి ప్రేమ్ కుమార్ పట్టా పాసు పుస్తకంలో 0.38 గుంటల స్థలం నమోదు చేయాలని కోరాడు. రుద్రారం గ్రామానికి చెందిన భరత్ 0.38 గుంటల భూమిని తన పేరున పాస్ పుస్తకంలో చేర్చి ఇవ్వాలని కోరుకున్నాడు. ఘనపూర్ గ్రామానికి చెందిన అంజయ్య 0.01 గంట భూమి బంధువుల పేరుమీద ఉన్నట్లు దస్త్రాలో ఎక్కించారని సమస్య పరిష్కరించాలని అర్జీ పెట్టుకున్నాడు. కార్యక్రమంలో ఎంఈఓ పీపీ రాథోడ్, మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్, పలుశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తులు నిల్

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తహసీల్దారు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఉదయం 10.30 గంటలకు దరఖాస్తులను స్వీకరించేందుకు అధికారులు దరఖాస్తులను స్వీకరించేందుకు గంటకు పైగా ఎదురు చూసినా ఒక్క దరఖాస్తు రాకపోవడం గమనార్హం. దీంతో అధికారులు చేసేదేమీ లేక కార్యక్రమాన్ని ముగించేశారు. ప్రజావాణి కార్యక్రమ నిర్వహణపై గ్రామాల్లోని ప్రజలకు అధికారుల ద్వారా సమాచారం లేకపోవడమే ప్రజావాణిలో ఫిర్యాదులు అందకపోవడానికి కారణం కావచ్చనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలకు ప్రజావాణిపై అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కల్హేర్ మండలంలో...

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్, సిర్గాపూర్ తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, ఉమశంకర్ ఫిర్యాదులు స్వీకరించారు. ఏఓ శ్రీకాంత్, ఆర్ఐ మల్లేశం, సిబ్బంది నరేష్, రాజు, డేవిడ్, రవి, లక్ష్మన్, సాయికుమార్ పాల్గొన్నారు.

ఇద్దరు మైనర్ల గుర్తింపు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భవన నిర్మాణంలో ఇద్దరు మైనర్ బాలురులతో పని చేపిస్తున్న వారిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఆపరేషన్ ముస్కాన్-ఎక్స్‌లో భాగంగా ఎస్ఐ యాదగిరి ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ హరిశంకర్, కానిస్టేబులు మహేందర్, శ్రీనివాస్, సంతోష్‌లు సోమవారం పట్టణంలోని అశోక్‌నగర్, కాకతీయనగర్ కాలనీలలో విధులు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో కాకతీయనగర్ కాలనీలో ఓ భవన నిర్మాణం వద్ద ఇద్దరు మైనర్లు పని చేస్తుండటాన్ని గమనించారు. దీంతో వారిని విచారించగా తమతో రత్నారామ్, యేసుబాబు పని చేపిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ కాంగ్రెస్ బలోపేతానికి కృషి



జిన్నారం(పటాన్‌చెరు): కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె కృష్ణ అన్నారు. మండలంలోని మాదారం గ్రామంలో కాంగ్రెస్ నేత రాజుగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీలకు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం గ్రామ యువజన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు రాజుగౌడ్, సంతు, మనోజ్, ప్రేమ్, రవి, యాదగిరి, శివకుమార్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఆకతాయిలతో అప్రమత్తంగా ఉండాలి

జిన్నారం(పటాన్‌చెరు): ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో డ్రైవర్ తీరు, ఇతర ఆకతాయిల పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ సుధీర్‌కుమార్ సూచించారు. జిన్నారంలో సోమవారం 'మై ఆటో ఈజ్ 'సేఫ్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోలకు కేటాయించిన క్యూ ఆర్ కోడ్‌ను డ్రైవర్‌లకు అందించారు. ఎస్ఐ నాగలక్ష్మి పాల్గొన్నారు.

◆ నారాయణఖేడ్ వైద్యాధికారిగా రమేష్

నారాయణఖేడ్: ఏరియా వైద్యశాల ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా రమేష్ నియామకమయ్యారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటలక్ష్మిని నర్సాపూర్‌కు బదిలీ చేయడంతో ఆమె స్థానంలో భద్రాది కొత్తగూడెం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న రమేష్‌ను ఏరియా వైద్యశాల ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా నియమించారు.

◆ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

జహీరాబాద్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి చిట్టెంపల్లి బాల్‌రాజ్ అన్నారు. సోమవారం పలు గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల పంటలు దెబ్బతింటున్నాయని, పెట్టుబడులు కూడా వస్తాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

◆ మృతుడికి బంధువులుంటే సంప్రదించండి

పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో తీవ్ర గాయాలై మృతి చెందిన వ్యక్తి బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కుర్షిత్‌అలీ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే..డివిజన్ పరిధిలోని పాత టోల్ గేట్ సమీపంలో రామచంద్రాపురం వైపు నుంచి పటాన్‌చెరు వైపు వచ్చే రహదారిలో ఈ నెల 20వ తేదీ తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. మృతి చెందిన వ్యక్తి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి ఆస్పత్రిలో బద్రపరిచారు. మృతుడికి బంధువులు ఉంటే సంప్రదించాలని పేర్కొన్నారు.

◆ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్‌గా లక్ష్మణ్

నారాయణఖేడ్: అంబేద్కర్, పూలే సేవాసమితి రాష్ట్ర సోషల్ మీడయా కన్వీనర్‌గా ఎస్.లక్ష్మణ్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ రహీం, పండరిల ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బైండ్ల కృష్ణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ సోషల్ మీడియా కార్యకర్తగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు. సంఘం నియమ నిబంధనలు పాటిస్తూ ప్రజలందరికీ సోషల్ మీడియా ద్వారా కృషిచేస్తానని అన్నారు.

◆ సమగ్రశిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

పటాన్‌చెరు: సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శేషాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ అనంతరం శేషాద్రి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో పీటీఐ అమీన్‌పూర్ మండల కమిటీ అధ్యక్షుడు భాను, భాస్కర్, రామకృష్ణ పాల్గొన్నారు.

◆ వాహనాల తనిఖీ

మునిపల్లి(అందోల్): బుదేరా చౌరస్తాలో డాగ్ స్కాడ్‌తో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేశ్ నాయక్ మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన పేపర్స్ ఏవి లేకున్నా చర్యలు తీసుకుంటామన్నారు.

◆ ఐఐఎం విద్యార్థిని సత్కారం

జహీరాబాద్: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో ఐఐఎం సీటును సాధించిన జహీరాబాద్‌కు చెందిన విద్యార్థిని శివానీతో పాటు ఆమె కుటుంబ సభ్యులను డీసీసీబీ మాజీ చైర్మన్, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జైపాల్‌రెడ్డి సన్మానించారు.

◆ మల్లికార్జున్ ఖర్గేను కలిసిన నేతలు

జహీరాబాద్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను జహీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఆదివారం రాత్రి కర్ణాటకలోని బెంగుళూరులో రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి జహీరాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి ఖర్గేను కలిశారు. ఖర్గే జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ సందర్భంగా వారు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

◆ గుర్తుతెలియని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం.. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో వ్యక్తి ప్రతి రోజు వచ్చి రాత్రి నిద్రిస్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం బస్టాండ్ పార్కింగ్ ఏరియాలో రావి చెట్టు కింద పడుకున్న చోట సదరు మృతి చెంది కనిపించాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు, ఘటన స్థానానికి చేరుకొని అతని జేబులో చూడగా ప్రభుత్వ ఆస్పత్రి పటాన్‌చెరుకు చెందిన ఓపీ స్లిప్పు ఉంది. అందులో అతని పేరు శంకర అని రాసి ఉంది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలని సూచించారు.

◆ భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

సంగారెడ్డి టౌన్: మానసిక పరిస్థితి బాగాలేని తన భర్త కనిపించడం లేదని భార్య సంగీత సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్లో సోమవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వట్పల్లి గ్రామానికి చెందిన పట్ల మారుతి భార్యతో కలిసి సంగారెడ్డి పట్టణంలో గొల్లగూడెంలోని అద్దె గదిలో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నారు. అతనికి కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ నెల 3వతేదీన మారుతి ఇంట్లో నుంచి ఆరోగ్య పరీక్షల కోసం హాస్పిటల్‌కు వెళ్లి వస్తానని తిరిగి రాలేదు. దీంతో ఎవరికైనా కనిపిస్తే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సంగీత కుటుంబసభ్యులు వేడుకున్నారు.